ప్రయాణం.. నరకప్రాయం



గుంతలమయంగా కొడవలూరు నుంచి అల్లూరు వెళ్లే రోడ్డు



ఆనవాళ్లు కోల్పోయిన కొత్తవంగల్లు రోడ్డు



మట్టి రోడ్డును తలపిస్తున్న యల్లాయపాళెం రోడ్డు



గుంతలు పడి రాళ్లు తేలి ఉన్న పెయ్యలపాళెం రోడ్డు

మండల పరిధిలోని రహదారులు దుర్భరంగా ఉన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. మండలంలో సింహ భాగం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

- చుక్కలు చూపిస్తున్న రహదారులు
- నిర్వహణ మరిచిన అధికారులు

కొడవలూరు : మండలంలో ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్లతోపాటు పంచాయతీరాజ్ రోడ్లు దయనీయంగా ఉన్నాయి. రోడ్ల ఆనవాళ్లు కోల్పోయి ఉండడంతో పాటు అనేక చోట్ల భారీ గుంతలు పడి నిత్యం ప్రమాదాలు జరుగుతూ వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిత్యం రోడ్లపై గుంతల్లో పడి ద్విచక్ర వాహనదారులు గాయపడుతూనే ఉన్నారు. బస్సుల్లో వెళ్లే వారైతే గమ్యం చేరే వరకు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తోంది.

ఇదీ రోడ్ల దుస్థితి

కొడవలూరు నుంచి అల్లూరు వెళ్లే సుమారు 20 కిలోమీటర్ల తారురోడ్డు ఆనవాళ్లు కోల్పోయి ఉంది. మట్టి రోడ్డును తలపిస్తోంది. భారీగా గుంతలు పడి ఉంది. ఇందులో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి తరచూ ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. ఈ రోడ్డుపై ఎక్కువగా ఆర్టీసీ బస్సులు వెళ్తుంటాయి. అల్లూరు, విడవలూరు మండలాలకు వెళ్తుండడంతో రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై గుంతలను తప్పించేందుకు యత్నించి బస్సులు వరి చేలలోకి దూసుకెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రాత్రిళ్లు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి రోడ్లపై ఉన్న గుంతల తీవ్రత తెలియక పల్టీలు కొట్టి పడిపోతున్నారు. ఇలా పడి ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఉన్నారు. ఈ రోడ్డు మాత్రమే కాక మండలంలోని అన్ని తారురోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది. మండలంలోని కొత్తవంగల్లుకు వెళ్లాలంటే సుమారు 15 కిలోమీటర్ల తారురోడ్డుపై వెళ్లాలి. ఈ రోడ్డు పొడవునా గుంతలు పడి మట్టి రోడ్డుగా మారి ఉంది. అదేవిధంగా యల్లాయపాళెం, పెయ్యలపాళెం, తలమంచి, దామేగుంట, రామాపురం తదితర ఆర్‌అండ్‌బీ రోడ్లు దుర్భరంగా ఉన్నాయి. వీటిపై ప్రయాణం నరకయాతనగా ఉంది.

లింక్ రోడ్ల పరిస్థితీ అధ్వానమే

మండలంలో ప్రధాన గ్రామాలను కలిపే లింకు రోడ్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇవన్నీ పంచాయతీరాజ్ పరిధిలో ఉన్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. హైవే నుంచి నాయుడుపాళెం మీదుగా గుండాలమ్మపాళెం వద్ద అల్లూరు రోడ్డును చేరుకునే లింకు రోడ్డు సుమారు 10 కిలోమీటర్లు ఉండగా రోడ్డంతా గుంతలమయంగా మారి ప్రమాదాలకు నెలవుగా మారింది. అదేవిధంగా హైవే నుంచి బొడ్డువారిపాళెం మీదుగా పద్మనాభసత్రం వద్ద అల్లూరు రోడ్డును చేరుకునే లింకు రోడ్డు దుర్భరంగా ఉంది. హైవే నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితీ ఘోరంగా ఉంది. హైవే నుంచి గండవరం, నాయుడుపాళెం, బొడ్డువారిపాళెం, పెయ్యలపాళెం రోడ్లు దారుణంగా ఉన్నాయి. ప్రధాన రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లయిన దామేగుంట, తలమంచి, వెంకన్నపురం, గుండాలమ్మపాళెం రోడ్లు దుర్భరంగా ఉన్నాయి.

నిర్వహణ ఏదీ

తారురోడ్డుపై చిన్నపాటి గుంతలు పడితే వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంది. అలా చేస్తే రోడ్డు పూర్తిగా దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు. కానీ రోడ్లపై గుంతలు పడినా పట్టించుకోకుండా గాలికొదిలేస్తున్నారు. దీంతో అవి భారీ గుంతలుగా మారి ప్రాణాపాయంగా మారుతున్నాయి. రోడ్ల నిర్వహణ తరచూ చేపట్టాలన్న నిబంధన ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

మండలం	కొడవలూరు
ఆర్‌అండ్‌బీ రోడ్లు	60 కి.మీ
అధ్వానంగా ఉన్న రోడ్లు	50 కి.మీ
పంచాయతీరాజ్ రోడ్లు	30 కి.మీ
అధ్వానంగా ఉన్న రోడ్లు	20 కి.మీ

వివరణకు విముఖత

మండలంలోని రోడ్ల దయనీయ పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఏఈలను వివరణ కోరేందుకు యత్నించగా, వారు సమాధానం చెప్పేందుకు విముఖత వ్యక్తం చేశారు. బదిలీపై వెళ్తున్నామని, కొత్తగా వచ్చే ఏఈలను అడగాలంటూ దాటవేసి ఫోన్ స్విచాఫ్ చేశారు.

భయమేస్తోంది



వృత్తిరీత్యా రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి రావాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో ఎప్పుడేం జరుగుతుందోనని భయమేస్తోంది. గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారినందున పగటిపూట ఎలాగోలా జాగ్రత్తలు తీసుకుని వస్తున్నాం. రాత్రిళ్లు ప్రయాణమంటేనే భయమేస్తోంది. ఇప్పటికే ఎంతో మంది గ్రామస్తులు రోడ్లపై ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు.

– జద్దా సాయికుమార్, యల్లాయపాళెం, కొడవలూరు మండలం

వెంటనే పునరుద్ధరించాలి



మూడు మండలాలకు వెళ్లే కీలకమైన అల్లూరు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా ఉంది. ఈ రోడ్డుపైనే ప్రతిరోజూ ఇంటికి రావల్సి ఉంది. గుంతలమయమైన రోడ్డుపై ఇంటికి సురక్షితంగా చేరే వరకు నమ్మకం ఉండడం లేదు. ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదు. పూర్తిగా రోడ్డును పునరుద్ధరించాలి.

– మందపల్లి మల్లికార్జున, వెంకన్నపురం, కొడవలూరు మండలం

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



మంత్రి నారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం : రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణను విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు ఆదివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వీఎస్‌యూలో అభివృద్ధి పనులు, పరిశోధన, అకడమిక్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ సపోర్ట్ సర్వీసెస్, నిధులు తదితర అంశాలపై చర్చించారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



హైవేపై రాత్రి వేళ ఆటో వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న మహిళలు

మనుబోలు : మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఆటోవాలాలు ఇష్టానుసారం ప్రయాణికులను తరలిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట, బండేపల్లి, గురివిందపూడి, కొమ్మలపూడి, కొండూరుసత్రం, కాగితాలపూరు, పిడూరు, బద్దెవోలు తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది వివిధ పనుల నిమిత్తం నిత్యం గూడూరు, నెల్లూరుకు ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే ఆర్టీసీ బస్సులు ఎక్కువగా లేకపోవడంతో పాటు ఉన్న బస్సులు కూడా సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ఆటోవాలాలు అత్యాశతో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సీట్లోనే కాకుండా ఆటోకు వెనుక వైపు కూడా ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. రాత్రి పూట సైతం ఒక్కో ఆటో 10 నుంచి 15 మంది ప్రయాణికులను ఎక్కించుకుని హైవేపై ప్రయాణాలు సాగిస్తున్నాయి. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా స్పోర్ట్స్ మీట్



విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు (టౌన్): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల స్పోర్ట్స్ మీట్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ రేస్ తదితర పోటీలను జరిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జూడాల భారీ ర్యాలీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కోల్‌కతాలోని ఆర్జీకర్ ఆస్పత్రిలో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ నగరంలో భారీ ర్యాలీని జూనియర్ డాక్టర్లు ఆదివారం నిర్వహించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణ నుంచి ఆర్టీసీ బస్టాండ్, తిరిగి ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్ మస్తాన్‌బాషా మాట్లాడారు. దోషులను శిక్షించేంత వరకు నిరసనలు, ఆందోళనలకు పూర్తి మద్దతిస్తామని తెలిపారు.

నేత్రపర్వంగా గోపురోత్సవం



నెల్లూరు(బృందావనం): పవిత్రోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పూజలు, నిత్య హోమాలు, గోపురోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఉభయదేవేరులతో కొలువైన రంగనాథుడ్ని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం మన జీవన విధానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : హిందూధర్మం మన జీవన విధానమని త్రైత సిద్ధాంత ప్రచారకర్తలు అన్నారు. నగర పంచాయతీ పరిధిలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రచారకర్తలు హిందూధర్మం విశిష్టత, ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించారు. ప్రతి వీధిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత చదివి ఆచరించడం వల్ల జీవితంలో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు సురమౌళి, శేషరత్నమ్మ, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు దూరంగా బాల్యం

- విద్యాశాఖకు కలగని కనువిప్పు



తోటపల్లిగూడూరు-నరుకూరు మధ్య కాగితాలు ఏరుకొంటున్న చిన్నారులు

తోటపల్లిగూడూరు : బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి.. అంటూ విద్యాశాఖ అనేక కార్యక్రమాలు జరపడమే తప్ప క్షేత్రస్థాయిలో వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించిన దాఖలాలు కానరావడం లేదు. ఎందరో బడిఈడు చిన్నారులు బడి బయట ఉంటున్నా విద్యాశాఖాధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాఠశాల పునఃప్రారంభంలో విద్యాశాఖ నెల రోజుల పాటు 'నేను బడికి పోతా' అంటూ బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాలు చేపట్టింది. అయితే ఆచరణలో వీరు సాధించిన విజయం ఏమీ లేదు. అనేక మంది చిన్నారులు తోటపల్లిగూడూరు-నరుకూరు గ్రామాల మధ్య చిత్తు కాగితాలను ఏరుకొంటూ కనిపిస్తున్నారు. తమను ఎవరూ బడికి పిలవలేదంటూ కొందరు సంచార జాతుల పిల్లలు బడికి దూరంగా బాల కార్మికులుగా మగ్గుతున్నారు. మండలంలో అనేక ప్రాంతాల్లో ఈ తంతు కనిపిస్తున్నా విద్యాశాఖాధికారుల్లో కనువిప్పు కలగడం లేదు.

కల్వర్టుల నిర్మాణంపై తహసీల్దార్ విచారణ

- ఇరువర్గాల వాగ్వాదం

పొదలకూరు : పట్టణానికి సమీపంలో ఉన్న లే–అవుట్ల నిర్మాణ వివాదాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ శ్రీనివాస లేఅవుట్లో ఉన్న శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సమీపంలో పొట్టేళ్ల వాగుపై దశాబ్దం క్రితం నిర్మించిన కల్వర్టులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందడంతో తహసీల్దార్ ఎం.సారంగపాణి ఆదివారం విచారణ చేపట్టారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన వెంకటరత్నం అనే ఉపాధ్యాయుడు కల్వర్టులను అక్రమంగా నిర్మించారని, లేఅవుట్ల ఆక్రమణలో అవి ఉన్నట్లు పలు దఫాలు కలెక్టర్, తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే దేవస్థానం పాలకమండలి, స్థానికులు తహసీల్దార్ చేపట్టిన విచారణకు హాజరై కల్వర్టుల వల్ల ఎవరికీ ఎలాంటి నష్టం లేదని, పైపెచ్చు అన్ని ప్రాంతాల వారికి ఇక్కడి రోడ్లు ఉపయోగపడుతున్నాయని వెల్లడించారు. వాగుపై కల్వర్టుల నిర్మాణం మంచి పరిణామమేనని, రాకపోకలకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో కొంత వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్షేత్రస్థాయిలోని పరిణామాలను ఉన్నత స్థాయి అధికారులకు వివరిస్తామని తహసీల్దార్ వెల్లడించారు. కాగా భాస్కర్‌నాయుడు వేసిన లేఅవుట్లో ప్రజాప్రయోజనాలకు వదిలిన స్థలం అమ్ముకున్నారని, పట్టాలేని స్థలాన్ని రిజిస్ట్రేషన్లు చేశారని, వాగు పొరంబోకు స్థలాన్ని ఆక్రమించారని ఫిర్యాదులు అందాయి. దీనిపై సంబంధిత శాఖ అధికారులు ఇటీవల విచారణ చేపట్టారు. ఈ క్రమంలో తిరిగి ప్రజల రాకపోకలకు ఉపయోపడే కల్వర్టులపై ఫిర్యాదు చేయడంతో స్థానికులు విచారణకు హాజరై వాగ్వాదానికి దిగి అందరికి ఉపయోగపడే కల్వర్టులను తొలగిస్తే సమ్మతించమని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

మనుబోలు : మనుబోలు గ్రామదేవతలైన మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు సాయిశర్మ వేదమంత్రోచ్చారణల మధ్య గ్రామదేవతలకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకుని సలిపిండి, పానకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

వేడుకగా పురస్కారాల ప్రదానం

ఇందుకూరుపేట : సరస్వతీ కళాపీఠం ఆధ్వర్యంలో పద్య, వచన కవిత పోటీల్లో విజేతలకు, పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పేరిశెట్ల పురస్కార ప్రదానోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. పేరిశెట్ల శివకుమార్, అరుణకుమారి షష్టిపూర్తి సందర్భంగా ఇందుకూరుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో కవులు, పండితులు తమ కవితలతో సాహితీ ప్రియులను అలరించారు. 'మేధావులంతా పిచ్చోళ్లే' అనే అంశంపై వచన కవితలు, 'నడుస్తున్న అమరావతి' అనే అంశంపై పద్య కవితల పోటీలు నిర్వహించి విజేతలకు పురస్కారాలను అందజేశారు. పద్య కవితల్లో ప్రథమ బహుమతి అమ్మళ్లదిన్నె వెంకటరమణ ప్రసాద్ (అనంతపురం), ద్వితీయ బహుమతి సీహెచ్‌వీ బృందవనరావు(నెల్లూరు), తృతీయ బహుమతి బీహెచ్‌వీ రమాదేవి(రాజమండ్రి) అందుకున్నారు. అలాగే చయనం అరుణాశర్మ (బెంగళూరు), ఇంద్రగంటి మధుసూదన్‌రావు(నెల్లూరు) ప్రోత్సాహక బహుమతులు పొందారు. అలాగే వచన కవితల్లో ప్రథమ బహుమతి తన్నీరు శశికళ(నాయుడుపేట), ద్వితీయ బహుమతి ఉత్పలిని(విజయనగరం), తృతీయ బహుమతి పొత్తూరు సీతారామరాజు(కాకినాడ)కు అందజేశారు. డాక్టర్ సూరం శ్రీనివాసులు, డాక్టర్ రాధేయ(అనంతపురం), డాక్టర్ మన్నేం సతీష్, ఎ.జయప్రకాష్, గోవిందరాజుల సుభద్రాదేవి, సజ్జా వెంకటేశ్వర్లు, సజ్జా వెంకటసురేష్, ఈతకోట సుబ్బారావు, అవ్వార శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



చిన్నారులకు బహుమతుల ప్రదానం

సరస్వతీ పుత్రులకు బహుమతులు

గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్వస్వతీ పుత్ర కళాపీఠం నిర్వాహకుడు పేరిశెట్ల శివకుమార్ మాట్లాడుతూ తన తండ్రి పేరిశెట్ల రామయ్య జ్ఞాపకార్థం గత 22 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామని వివరించారు.

ఆత్మీయ అనుబంధానికి రక్షాబంధన్

- నేడు రాఖీ పౌర్ణమి
- మార్కెట్లో విభిన్న రాఖీలు



కోవూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల రాఖీలు

కోవూరు : అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయత, అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే వేడుక రక్షాబంధన్. హిందూ సంప్రదాయ పండగల్లో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నది రాఖీ పౌర్ణమి. ఏటా శ్రావణ మాసంలో రాఖీ పండగను జరుపుకుంటారు.

జోరందుకున్న అమ్మకాలు

నేడు రక్షాబంధన్‌ను పురస్కరించుకుని రాఖీ విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతులు, ఆకర్షణీయమైన రంగులు, చూడంగానే ఆకట్టుకునే మోడల్స్‌లో రాఖీలు యువతకు కనువిందు చేస్తున్నాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రాంత ప్రజల అభిరుచులకు తగ్గట్లు మార్కెట్లో రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. రూ.20 నుంచి రూ.200 వరకు ధరల్లో సాధారణ రాఖీలు లభ్యమవుతున్నాయి. దుకాణాల్లోనే కాకుండా ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వివిధ వెబ్‌సైట్‌లలో రాఖీలకు సంబంధించి అనేక మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. వాటికి పలు ఆఫర్లను సైతం అందిస్తున్నాయి. దానికి తోడు వెండితో తయారు చేసిన రాఖీలను కూడా ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. ఇవి రూ.800 నుంచి రూ.4 వేల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. గత రెండు మూడు రోజులుగా రాఖీల విక్రయాలు జోరుగా సాగుతోంది. చిన్నారులను ఆకట్టుకునేందుకు డోరేమాన్, మిక్కీమౌస్, హనుమాన్ వంటి బొమ్మలతో రాఖీలను విక్రయాలకు ఉంచారు. వీటిని కొనుగోలు చేసేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు.

వ్యాపారం తక్కువ



గతంలో రాఖీలు విక్రయించే దుకాణాలు తక్కువగా ఉండేది. దీనివల్ల వ్యాపారం బాగా జరిగేది. ఇప్పుడు దుకాణాల సంఖ్య గణనీయంగా పెరిగాయి. ఒక్క కోవూరులోనే 30కి పైగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దానికి తోడు ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్‌లు పెడుతున్నారు. దీనివల్ల ముందులా వ్యాపారం ఉండడం లేదు.

– నాగసూరి వెంకటప్రవీణ్, వ్యాపారి, కోవూరు

ఇండియాకి రాఖీలు పంపుతాను



మేము నెల్లూరులో ఉన్న సమయంలో ప్రతి ఏడాది మా కుటుంబంలోని సోదరులతో రాఖీ పౌర్ణమిని జరుపుకునేవాళ్లం. వివాహం తరువాత నా భర్తతో కలిసి ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డాం. అయిన సరే రాఖీ పౌర్ణమి సందర్భంగా వారం ముందుగానే అమెరికా నుంచి కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి పోస్ట్ ద్వారా రాఖీలు పంపుతున్నాం.

– ఈదూరు శైలజ– అజయ్ దంపతులు, అమెరికా(కోవూరు వాస్తవ్యులు)

ప్రతిఏటా వచ్చి రాఖీ కడుతున్నా..



నేను తిరుపతిలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నా. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏడాది నా తమ్ముడికి రాఖీ కడుతాను. అందుకోసం ఈ ఏడాది కూడా ఇంటికి వచ్చాను. రాఖీ పౌర్ణమి జరుపుకుని తిరుపతికి వెళ్తాను. నా తమ్ముడితో పాటు కజిన్ బ్రదర్స్‌కు కూడా రాఖీలు కడుతాను.

– గంగపట్నం శ్రావ్య, పడుగుపాడు

రాజరాజేశ్వరి అమ్మవారికి బంగారు బొట్టు బహూకరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి 24.6 గ్రాముల బంగారు బొట్టు.. 853 గ్రాములు కలిగిన రెండు వెండి నవావరణ హారతులను నగరానికి చెందిన మధుశేఖర్ ఆదివారం బహూకరించారు. సుమారు రూ.2.4 లక్షల విలువగల వీటిని ఆలయంలో ఈఓ వెంకటసుబ్బయ్యకు అందజేశారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

సేవకుడిగా పనిచేస్తా



వివాహ వేడుకలో కాకాణి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : ఓడినా.. గెలిచినా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిరదవోలు పంచాయతీ ముత్యాలపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు, పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ కండే రమణయ్య కుమారుడి వివాహానికి కాకాణి ఆదివారం హాజరయ్యారు. పంచాయతీకి చెందిన కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతి అన్యాయంపై గళం విప్పడంతో పాటు ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు ఉద్యమిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషిస్తోందని, ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తుందన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కాకాణి వెంట బిరదవోలు ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, ఇంద్రసేన్‌గౌడ్, బడుగు శ్రీహరి, వి.కృష్ణారెడ్డి, ఆకుల గంగిరెడ్డి, బడుగు శ్రీనివాసులుగౌడ్, కేతబోయిన వెంకట్రావ్ ఉన్నారు.